ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



ఎంపీ అనురాధ

అల్లవరం: కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఎంపీ చింతా అనురాధ అన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం జిల్లా ప్రజలు, పార్టీ నాయకులు, అధికారులకు ఎంపీ అనురాధ శుభాకాంక్షలు తెలిపారు. గత నాలుగేళ్లుగా ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేశారని చెప్పారు. ఏపీలో సంక్షేమం పరుగులు పెట్టిందని, ప్రతి గడపకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా పంపిణీ చేశారన్నారు. ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని ఏపీని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచిన సీఎం జగన్ కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మంచి చేస్తారన్నారు.

నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: నూతన సంవత్సన వేడకల సందర్భంగా నియోజకవర్గ ప్రజల కోసం రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ భట్నవిల్లిలోని తన నివాసంలో అందుబాటులో ఉంటారని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదలైంది.

మార్కెట్‌కు నూతన సంవత్సర శోభ

రద్దీగా బేకరీ, స్వీటు దుకాణాలు

అమలాపురం టౌన్/ఉప్పలగుప్తం: మార్కెట్‌లో నూతన సంవత్సర శోభ నెలకొంది. ఆదివారం పల్లె పట్టణమన్న తేడా లేకుండా ఆదివారం రాత్రి 12 గంటలకు పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేకులు కట్ చేసి యువత సందడి చేశారు. యువతులు, మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులు వేస్తూ కనిపించారు. చర్చిలు, దేవాలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఉప్పలగుప్తం మండలంలోని గొల్లవిల్లి, ఉప్పలగుప్తం, చల్లపల్లి, భీమనపల్లి ప్రధాన కేంద్రాల్లో వస్త్ర, రంగులు, పూలు, పండ్లు, బేకరీలు, స్వీటు షాపులు వద్ద కొనుగోలుదారులతో సందడి చేశారు. బిర్యానీ సెంటర్లు ప్రత్యేక ఆఫర్లు పెట్టి మరీ వినియోగదారులను ఆకర్షించాయి. ఒక్క అమలాపురం పట్టణంలోనే ఆదివారం ఒక్క రోజే బేకరీ, స్వీటు, పూల దుకాణాల్లో దాదాపు రూ.50 లక్షలకు పైగా మార్కెట్ లావాదేవీలు జరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.



అమలాపురంలో పూల బొకేల దుకాణాల వద్ద కొనుగోళ్ల సందడి



అమలాపురంలో నూతన సంవత్సర వేడుకల కోసం తయారుచేసిన స్వీట్లు

పటిష్టమైన పహారా

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో ప్రజలు జరుపుకునేందుకు అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐ టి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పహారా ఏర్పాటుచేశారు. ఆదివారం రాత్రి ఒంటి గంట వరకే వేడుకలకు అనుమతినిచ్చారు.

పోస్టల్ క్యాలెండర్ ఆవిష్కరణ

అల్లవరం: నూతన సంవత్సర ఎఫ్ఎన్‌పీఓ పోస్టల్ యూనియన్ క్యాలెండర్‌ని ఎంపీ అనురాధ మొగళ్ళమూరులోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. రాజోలు, రామచంద్రాపురం ప్రాంతాల్లో ప్రధాన తపాలా కార్యాలయం, మోరీలో నూతన కార్యాలయం ఏర్పాటుకు ఎంపీ అనురాధ కృషిని పోస్టల్ యూనియన్ ప్రతినిధులు కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కొత్త క్యాలెండర్‌ని ఎంపీ అనురాధ ఆవిష్కరించి ప్రదర్శించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎస్వీ సూర్యనారాయణ, ఏకాంబరం పాల్గొన్నారు.

ఆటగాళ్లు పుట్టరు.. మనమే తయారు చేయాలి



ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఆటగాళ్లు ఎక్కడి నుంచో పుట్టుకు రారని, మనమే తయారు చేయాలన్న స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. 'క్రీడలతో రాజకీయ క్రీనీడ ఆడుదాం ఆంధ్రా' అంటూ ఆంధ్రజ్యోతి పత్రికలో ఓ వ్యాసకర్త రాసిన కథనం ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంతటి దూరాలోచనతో అమలు చేస్తున్నారో వివరించారు. గత ప్రభుత్వాలు క్రీడల పరంగా ఆంధ్రప్రదేశ్‌ను వెనుకడుగు వేసేలా చేశాయని పేర్కొన్నారు. తాను చదివే పాఠశాలలో కప్ కొట్టలేని వాడు రాష్ట్రానికో, దేశానికో కప్ ఎలా సాధిస్తాడని ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో క్రీడల్లో నైపుణ్యం పెరిగినప్పుడే రాష్టానికి లేదా దేశానికి కప్‌లు సాధించే స్థాయికి ఎదిగే క్రీడాకారులు పుడతారని చెప్పారు. గత ప్రభుత్వాలు ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా మార్చాయా? అని ప్రశ్నించారు. ఆటలనేవి ఓటు బ్యాంక్ కాదని, 15 ఏళ్ల వయసువారిని సైతం ఆడుదాం ఆంధ్రాలో భాగస్వాముల్ని చేశారంటే.. వారికి ఓట్లు ఎక్కడున్నాయని అన్నారు. ప్రతి పక్షాలు, పచ్చ పత్రికలు ఈ వాస్తవాన్ని గ్రహించాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు హితవు పలికారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని కొంకాపల్లిలో నూతనంగా ప్రారంభించిన ప్రమోద్ డయోగ్నోస్టిక్ ల్యాబ్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం ప్రారంభించారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ వైద్య రంగంలో పేద ప్రజలకు సహకరించి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు కారెం రవితేజ, శ్రావణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ముత్తాబత్తుల ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి జాతీయ గణిత దినోత్సవం

ముమ్మిడివరం: మండలంలోని అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోనసీమ జిల్లా స్థాయి జాతీయ గణిత దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు గణిత రంగవల్లులు, క్విజ్, వైజ్ఞానిక ప్రదర్శన, మేథ్స్ టాలెంట్ టెస్టులు ఆదివారం నిర్వహించారు. ప్రముఖ గణిత అవధాని పాఠ్య గ్రంథ రచయిత పతివాడ రవిశంకర్ గణితావధానం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, గాడిలంక హైస్కూల్ హెచ్‌ఎం గొర్రెల ఉదయ భాస్కరరావు, అయినాపురం హైస్కూల్ హెచ్‌ఎం తాడిశ్రీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బీడీకే వరప్రసాద్, ఉపాధ్యాయులు ఆనందరావు, దుర్గారావు, రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ ఫిల్మ్ ఆర్టిస్ట్‌ల వితరణ

అమలాపురం టౌన్: కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ ప్రతినిధులైన సినీ ఆర్టిస్టులు డిసెంబర్ 31వ తేదీ వేడుకలను సేవా కార్యక్రమాల ద్వారా వినూత్నంగా జరుపుకున్నారు. అసోసియేషన్ గ్రూపు సభ్యులు విరాళాల ద్వారా రూ.25 వేలు సేకరించి బియ్యం బస్తాలు, కిరాణా సరకులు, కూరగాయలు, స్వీట్లు కొనుగోలు చేశారు. వాటిని ఆదివారం స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో ఉన్న ప్రేమ మందిరంలో పెరిగే అనాథలు, లూయీ అంధుల పాఠశాల విద్యార్థులకు అసోసియేషన్ అధ్యక్షుడు గనిశెట్టి రమణలాల్, గౌరవాధ్యక్షుడు గుర్రం రామకృష్ణ, వీరభద్రరావు, వేమూరి రాజశేఖర్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎరుబండి చంటి, నామన దుర్గారావు, డాన్స్ మాస్టర్ నరేంద్ర, గొలకోటి హరి, మట్టపర్తి శ్రీను, తడాల మూర్తి పాల్గొన్నారు.

వృద్ధులకు క్రిస్మస్ కానుకలు

అల్లవరం: క్రిస్మస్, నూతన సంవత్సరం పురస్కరించుకుని బొమ్మి నరసింహమూర్తి మరియు బంగాయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోడి, బెండమూర్లంక గ్రామాల్లోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ రగ్గులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దొమ్మేటి వెంకటేశ్వరావు, రేవు శ్రీనివాసరావు, కడలి ప్రసాద్, ముసునూరి రాజు, ఉందుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

అమలాపురం రూరల్: మండలంలోని చప్పిడివారిపాలెంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు చిందాడగరువు ఎంపీటీసీ సభ్యురాలు మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులు చీరలు, దుప్పట్లు ఆదివారం అందజేశారు. బాధితులను పరామర్శించిన వారిలో నల్లా బ్రహ్మాజీ, దుర్గారావు తదితరులున్నారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

అమలాపురం టౌన్: స్థానిక ముస్లిం వీధిలో సయ్యద్ హజరత్ ఖాజాబాబా 66వ ఉరుసు మహోత్సవాలను సోమ, మంగళ, బుధవారాల్లో వైభవంగా నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ముస్లింవీధిలోని హజరత్ ఖాజాబాబా దర్గాను పూలమాలలతో అలంకరించారు. సోమవారం దర్గా నుంచి గంధం తీసే కార్యక్రమం, మంగళవారం రాత్రి మహిళల మిలాద్ నిర్వహించనున్నట్లు పెద్దలు చెప్పారు.

మంత్రి విశ్వరూప్‌కు వినతి పత్రం

అమలాపురం రూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను భట్నవెల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ సంఘం నాయకులు ఆదివారం కలిసి తమ సమస్యలను తీర్చాలంటూ వినతి పత్రం అందజేశారు. సత్యసాయి డీపీటీఓ అధికార దుర్వినియోగానికి పాల్పడి తానే క్రమశిక్షణ అధికారిగా వ్యవహరించి సస్పెన్షన్‌లకు గురిచేయడం దారుణమని కోనసీమ జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు, డిపో కార్యదర్శి పితాని మణిరాజు, సుబ్బారావు మంత్రికి ఫిర్యాదుచేశారు.

వెంకన్న ఆలయానికి చేరుకున్న నల్లరాయి

యానాం: పట్టణంలో కొలువైన శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామివారి నూతన ఆలయ నిర్మాణానికి తొలి అడుగు పడింది. ఆదివారం ఆలయ నిర్మాణం కోసం టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ నేతృత్వంలో మొదటి విడతగా 40 టన్నుల నల్లరాయి పలకలు యానాంకు చేరుకున్నాయి. ఆర్ఏఓ మునిస్వామి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆలయం వద్దకు చేరుకుని పలకల దిగుమతిని పర్యవేక్షించారు. ఇప్పటికైనా ఆలయ నిర్మాణ పనులు త్వరితగతంగా చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు భక్తులు కోరుతున్నారు.